దీపావళి సందడి

● పూలు, ప్రమిదలు, పటాకులు, పూజా సామగ్రికి గిరాకీ

ఐబీలో పూలు అమ్ముతున్న వ్యాపారులు

తాండూర్ వారసంతలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాలు

తాండూర్, నవంబర్ 11 : ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకునే వెలుగుల పండుగ దీపావళి సందడి తాండూర్ మండలంలో మొదలైంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే దీపావళి ఈ యేడు కూడా ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీపావళిని పురస్కరించుకుని టపాసుల దుకాణాల వద్ద కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని వారసంతలో వ్యాపారులు బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. వ్యాపారులు ప్రజలను ఆకర్షించేందుకు పటాకులు కేజీల్లో విక్రయిస్తున్నారు. అగ్నిమాపక అధికారుల నిబంధనలు పాటిస్తూ, అన్ని శాఖల అధికారుల అనుమతి పత్రాలతో అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు దుకాణాల యజమానులు తెలిపారు. మొత్తంమీద ఈ సంవత్సరం గతంలో కంటే ధరలు అధికంగానే ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలకు ఆమోదయోగ్యమైన ధరలకే పటాకులు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. లక్ష్మీ పూజల కోసం పెద్ద ఎత్తున పూల వ్యాపారులు పూల అమ్మకాలు చేపట్టారు. దీపావళి దీపాల కాంతుల కోసం ప్రజలు ప్రమిద, బొమ్మల కొలువు కోసం బొమ్మలు కొన్నారు. దీపావళి సందర్భంగా తాండూర్ ఐబీలో అమ్మకం దారులు, కొనుగోలు దారులతో కళకళలాడింది. పటాకులు కాల్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బెల్లంపల్లి అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రమిదలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఎన్నికల స్క్వాడ్ వాహనాలకు

నిఘా నేత్రం...

తాండూర్, నవంబర్ 11: అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతి ప్రాంతాన్నీ, మార్గాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎక్కడైనా, ఏదైనా జరిగితే వెంటనే జిల్లా అధికారుల వరకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తిరిగే వాహనాలకు నిఘా నేత్రం (సీసీ కెమెరా) ఏర్పాటు చేశారు. ఈ వాహనం సంచరించేటప్పుడు సీసీ కెమెరాలు 360 డిగ్రీల్లో తిరుగుతూ నిఘా పెడుతాయి. వీటి ద్వారా సేకరించిన ఫుటేజీలను మండలం, జిల్లా స్థాయిలో ఉండే అధికారులు తమ కార్యాలయాల్లో వీక్షిస్తారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పక్కా చర్యలు చేపడుతున్నారు. బెల్లంపల్లిని సమస్యాత్మక నియోజకవర్గంగా రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు తిరుగుతున్నాయి. వాహనానికి 360 డిగ్రీల్లో తిరుగుతూ చిత్రాలు రికార్డు చేసే సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు.

ఎన్నికల స్క్వాడ్ అధికారులు కారుపై అమర్చిన సీసీ కెమెరా

ఎన్నికల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ

● ఎన్నికల పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా

సీసీసీ నస్పూర్, నవంబర్ 11: నిరంతర పర్యవేక్షణలో మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దత్తా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులుగా బిశ్వజిత్ దత్తా, చెన్నూర్ పరిశీలకులుగా సజ్జనార్‌లను నియమించగా, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు ఖర్చుల పరిశీలకులుగా ఆశోక్‌కుమార్ సత్తార్, మంచిర్యాల నియోజకవర్గానికి సీఎస్ పవన్‌ను నియమించారు. వీరు సీసీసీ నస్పూర్ సింగరేణి అతిథి గృహంలో బస చేస్తున్నా రు. వీరంతా రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు చేసే ప్రచారం సందర్భంగా పెట్టె ఖర్చులు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, శాంతిభద్రతలు, అనుమతులు, ఇతరాత్ర ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. ఎన్నికల సంబంధిత సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సింగరేణి అతిథి గృహంలో అందుబాటులో ఉంటారని, రాజకీయ పార్టీలు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పద్మల్‌పురి ఆలయంలో ఆదివాసుల పూజలు

● ఆకట్టుకున్న గుస్సాడీ నృత్యాలు

గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసులు

పద్మల్‌పురి కాకో అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దండేపల్లి, నవంబర్11: దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నది ఒడ్డున ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి, నది ఒడ్డున పూజలు చేశారు. పవిత్ర జలాలను కాకో వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానుగ నూనెలో తయారు చేసిన గారెలను నైవేద్యంగా అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి సామూహిక విందు భోజనాలు చేశారు.దండారీ, గుస్సాడీ నృత్యాలతో ఆకట్టుకున్నారు.దీపావళి పండుగ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 11: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సనాతన ఎనాలటిక్స్ ఐటీ కంపెనీలో శనివారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు దీపావళి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సనాతన ఎనాలటిక్స్ ఐటీ కంపెనీ నిర్వాహకులు, ఉద్యోగులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న కంపెనీ ప్రతినిధులు

పేదలకు అన్నదానం

భోజనం చేస్తున్న పేదలు, బాటసారులు

బెల్లంపల్లి, నవంబర్ 11: వేడుకలు, తదితర కార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను అమ్మ ఒడి ఎన్జీవో, టెక్నో డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సేకరించి నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారు. బెల్లంపల్లి కాల్‌టెక్స్‌లో జరిగిన కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను శనివారం కాంటా చౌరస్తా వద్ద అడ్డా కూలీలకు అందించారు. ఏదైనా కార్యక్రమంలో ఆహార పదార్థాలు మిగిలిపోతే సెల్ నంబర్‌కు 9908232303లో సంప్రదించాలని అమ్మ ఒడి బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్ల మధుకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గెల్లి రాజలింగు, అమ్మ ఒడి సభ్యులు దాసరి లక్ష్మణ్, ఎస్‌డీ పాషా, చిదురాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కన్నెపల్లి, నవంబర్ 11 : కన్నెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. ఎండీ హరీఫ్, ఏరుకొండ మల్లిక ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో జానపద నృత్యంలో ప్రతిభ చూపాలని తెలిపారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. శనివారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రమేశ్, గైడ్ టీచర్ విజయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ సంతోష్ అభినందించారు.